# మహిమ

ఆవాళ రోటరీక్లబ్బులో ఒక పిహెచ్.డి., వైవా సందర్భంలో యూనివర్శిటీకి వచ్చిన ఒక పేరుమోసిన బయో కెమిస్ట్రీ ప్రొఫెసరు ప్రత్యేక ఉపన్యాసం. 'మహాత్ములు - మహిమాన్విత వైద్యవిధానం' అనే విషయం మీద గంటదాకా సాగిన ఆయన ఉపన్యాసం విని క్లబ్బుమెంబర్లూ, ప్రత్యేకాహ్వానితులూ ఆ గంటసేపూ యేదో లోకాలకు వెళ్ళిపోయారు. అది అలవాటే! వెన్నెల్లో డిన్నరు తర్వాత బాబాలు, స్వాములు, అమ్మల మహత్యాల గురించి, జీవసమాధుల గురించి చర్చ సాగింది. చర్చలో ప్రొఫెసరుగారు రామాపురం అప్పనాయన చెయ్యి సోకితే, డాక్టర్లకు లొంగని యేయే మాయ రోగాలు నయమయ్యాయో దృష్టాంతాలతో సహా వివరించారు. మెంబర్లలోని యిద్దరు మెడికల్ షాపుల వాళ్ళూ ముగ్గురు డాక్టర్లు తప్ప, మిగతా వాళ్ళంతా తమ జిల్లాలోనే అప్పనాయనంత గొప్ప వాడున్నందుకు తెగ సంతోషించారు. తమకు ఆయన మహిమలతో యెప్పుడైనా అవసరం రావచ్చు మరి!

మధ్యలో ఎవరో, యూనివర్సిటీ ఇంగ్లీషు రీడరు డా. శాంతివర్ధన్‌తో అన్నారు :

"డాక్టర్ శాంతివర్ధన్ ! మీరెందుకు ట్రై చేయకూడదూ, జస్ట్ ఎ ఛాన్స్. వేలూరు, గీలూరు దండగ. డబ్బు క్షవరం తప్ప, అంతా బోష్."

"శాంతివర్ధన్ ట్రై చేయడమేంది ?" అన్నారెవళ్ళో.

"వాళ్ళ బాబు పాపం మూడేళ్ళు... యేం జబ్బో ? యింతవరకు..."

కొడుకు జబ్బు ప్రస్తావన వచ్చేవేళకు డాక్టర్ శాంతివర్ధన్ తట్టుకోలేక పోయాడు. "యిప్పటికే ఆలస్యమైందంటూ" అందరికీ చెప్పి స్కూటరెక్కి ఇంటికి బయలుదేరాడు.

అవును. ఛాన్సు తీసుకుంటే యేం పోయింది ? ఛాన్సేమిటి ? దేశంలో పెద్ద పేరున్న బయో కెమిస్ట్రీ ప్రొఫెసర్ వంటివాడే అన్ని అనుభవాలు చెబితే ? బాబు ఆరోగ్యం కుదుటపడలేదు. యిప్పటికి రెండువేలు పైన్నే ఖర్చాయింది ? యేం డాక్టర్లో, ఏం స్పెషలిస్టులో యేమో ? జబ్బు పేరేదో సరిగా చెప్పరు. ట్రీట్‌మెంట్ మాత్రం సాగుతూనే ఉంటుంది, అదంటూ, యిదంటూ, జబ్బు నయమైనట్లే కన్పించి తిరగబడుతుంది. వేలూరికో, మద్రాసు విజయా హాస్పిటల్‌కో తీసుకుపోతానంటే చిల్డ్రన్స్ స్పెషలిస్టు మిత్రుడు "వుండు తొందరేమీలే" దంటాడు. తనకు అయిదారువేలు పెద్దగా లెఖ్ఖలోదికాదు. సుజాత కట్నం డబ్బు తాకవలసిన పనికూడాలేదు. రామాపురం తీసుకపోతే...

శాంతివర్ధన్, కొడుకును రామాపురం తీసుకువెళ్ళాలనే నిశ్చయాని కొచ్చాడు.

ఇంట్లో విషయం చెప్పాడు. భార్య ఫిజిక్స్ లెక్చరర్ డాక్టర్ సుజాత, "మంచిదే" అంది. తల్లి సంతోషించింది. కోడలు అటువెళ్ళాక "మీ అక్కనుకూడా రామాపురం తీసుకుపొమ్మని మీ బావకు జాబు రాయరా," అంది. శాంతివర్ధన్ అప్పటికి "సరే" అన్నాడు. "యేం సరేనో పల్లెలో యెన్నవస్తలు పడ్తావుందో, లేమిడి సంసారం" అని తల్లి కూతురు కాపురం, కోడలు పెత్తనం, కొడుకు మాయలోకం గుర్తుకొచ్చి చాటుగా చెంగుతో కళ్ళొత్తుకుంది.

డాక్టర్ శాంతివర్ధన్ భార్యను వెంటబెట్టుకొని, కొడుకుని తీసుకుని రామాపురం బయలుదేరాడు. రామాపురం అప్పనాయన కోసం వచ్చి పోయే జనాన్ని చూసి విస్తుపోయాడు.

మారుమూలనున్న ఆ పల్లెటూరికి అప్పనాయన పుణ్యాన కొత్తగా వేసిన రోడ్డుమీద ప్రత్యేకంగా తిరిగే బస్సులు. స్థానిక పెద్దలు, ప్రభుత్వాధికారులు అక్కడ చేసిన ఏర్పాట్లు ఘనంగా వున్నాయి. ఆశ్రమ నిర్మాణం పెద్ద ఎత్తున

మొదలైంది. కార్లలో, బస్సుల్లో, కాలినడకనా వచ్చేపోయే మారాఖారపు ఋబ్బుల జనం. చంకల్లో, పక్కల్లో పిల్లలతో ఆడవాళ్ళు; మగవాళ్ళు, ముసలోళ్ళు, ఏ రోగాలో కాటేసిన యెవళ్ళెవళ్ళో!

అప్పనాయన దర్శనమయ్యాక శాంతివర్ధన్‌కు తాను చదివిన మర్మ కవిత్వమంతా గుర్తుకొచ్చినట్లయింది. అప్పనాయన రూపం, పలుకు, నవ్వు, స్పర్శ అంతా యేదో మాయగా కన్పించింది.

రామాపురం నుంచి వచ్చిన వారం రోజుల్లో కొడుక్కు గుణమొచ్చింది. పూర్తి చెకప్‌చేసి, స్పెషలిస్టు మిత్రుడు "మీ వాడికేం ఫర్వాలేదు. చూశావుకదా! వేలూరు, మద్రాసు అన్నావు – మేమంతా పనికిరానివాళ్ళమనుకుంటూ" అని నవ్వాడు.

డాక్టరు విశ్వాసాన్ని శాంతివర్ధన్ కాదనలేదు. తన యాత్ర గురించి చెప్ప లేదు. యిప్పుడు శాంతివర్ధన్ ప్రాచీన సంస్కారం వొకమారు వెయ్యి కళ్ళు విప్పింది.

శాంతివర్ధన్ ఇక అప్పనాయన లోకంలో పడిపోయాడు. తరచు రామా పురం వెళ్ళడం మొదలైంది. అప్పనాయన బోధలు, మహిమలు మీద విషయం సేకరించి, తన ఇంగ్లీషు పాండిత్యానికి సార్థకంగా యింగ్లీషులోనే పుస్తకం రాయ డానికి యిటీవల తంటాలు పడసాగాడు.

పుస్తక రచన సాగుతున్న రోజుల్లోనే, వాళ్ళ బావ దగ్గరనుంచి వుత్తరం వచ్చింది–

'వాళ్ళ అక్క ఆరోగ్యం బాగా దెబ్బతినిందనీ, యీ యేడు పంటల్లేక పోవడంతో పరిస్థితులు మరీ అన్యాయం అయ్యాయనీ, ప్రసాదుకు వుద్యోగం వచ్చే ఆశ లేదనీ, పెద్దాసుపత్రిలో తెలిసిన డాక్టర్లెవరైనా వుంటే తిరుపతికి ప్రసాదుతో పంపుతాననీ...'

వుత్తరం సంగతి తల్లికి చెబుదామనుకున్నాడు. సుజాత గొడవ పెడు తుందని మానేశాడు.

వాళ్ళొస్తే తనకిక మనశ్శాంతి వుండదు. పుస్తకం నెలలో పూర్తి కావాలి. పైగా మంత్రి ఆవిష్కరించబోయే పుస్తకం.

మధ్యలో యెప్పుడో వొకమారు అక్క సంసారం, బాబును రామాపురం తీసుకు వెళ్ళాలనుకున్నప్పుడు తల్లి అన్న మాటలు గుర్తుకు వచ్చాయి. చాటుగా తల్లికి విషయం చెప్పి "నూర్రూపాయలు మనియార్డరు కూడా చేస్తున్నా" అన్నాడు. అప్పటికి తల్లి మురిసిపోయింది.

కావడు శాంతివర్ధన్ సుదీర్ఘమయిన వుత్తరం రాశాడు - అక్కను అప్ప నాయనవద్దకు తీసుక వెళ్ళటమే క్షేమమంటూ.

అప్పనాయన మీద శాంతివర్ధన్ రాసిన గ్రంథం ఆవిష్కరణ విశేషాలు ఆకాశవాణి ప్రత్యేక ప్రసారం చేసింది. చేసిన ఆ మూడోరోజో, నాలుగోరోజో శాంతివర్ధన్‌కు పొగడ్తల వుత్తరాలతోపాటు మరో వుత్తరం వచ్చింది:

"డాక్టర్ శాంతివర్ధన్, ఎమ్.ఎ., పిహెచ్.డి., మామకు,

ఇటీవల నాయనకు మీరు రాసిన ఉత్తరం చూసే భాగ్యం నాకు అబ్బింది. మీరా వుత్తరాన్ని డబ్బుతెలివితో రాసినారో, తెలివిమీరి రాసినారో నా కయితే అర్థం కాలేదు.

మీ వంటి పుణ్యాత్ములైన మేధావులు. ప్రభుత్వం కృషి వల్ల అప్పనాయన ఖ్యాతి మా పల్లెలకు కూడా పాకింది. మంచిదే. దరిద్రం వర్ధిల్లేటప్పుడు అజ్ఞానమూ వర్ధిల్లవలసిందే. లేకపోతే మీ పుస్తకాన్ని మంత్రులెట్లా ఆవిష్కరిస్తారు ? మీకు ప్రొఫెసర్‌షిఫ్ ఇంకా రాలేదా? పుస్తకాలు పదివేల కాపీలయినా అమ్ముడు పోయి నాయా ?

మా అమ్మకు యే వ్యాధి అనుకున్నారు? తిండి లోపమనే వ్యాధి విషయం మీరు వినేవుంటారు. దాన్నుంచి వచ్చింది. మీరు వుత్తరం రాసినారనీ, అప్ప నాయన మహిమ కోసం డబ్బు పంపుతున్నారనీ, అమ్మను మా నాయన రామా పురం తీసుక వెళ్ళే ప్రయత్నంలో వున్నాడు.

మా నాయన మాదిరి వాళ్ళంతా వొక విషయం ముందు ముందయినా అర్థం చేసుకుంటారనుకుంటాను; మీరు, మీ పిల్లల ఆరోగ్యాలు అప్పనాయన వల్ల కుదరక పోయినా, మళ్ళీ వైద్యం నమ్ముకోగలరు, చేయించుకోగలరని, యెటు తిరిగినా నష్టమంతా వైద్యం చేయించుకునే శక్తిలేని వాళ్ళదేనని.

ఆఖరిమాట ! దయచేసి అప్పనాయన తిండిలోపం రోగాలను కూడా నయం చేసిన మహిమలుంటే రాయండి. మీతో పాటు రక్తం పంచుకొని పుట్టిన మా అమ్మనూ మా వూళ్ళో చాలా మందినీ నేనే స్వయంగా తీసుకు వెళతాను. అట్లాగే మరీ ముఖ్యంగా నిరుద్యోగ రోగాలను నయం చేసిన సంగతులుంటే రాయండి. అప్పనాయన దగ్గరకు ఎంప్లాయిమెంటు ఎక్స్ఛేంజీలనే యేకంగా పంపించవచ్చు.

పొరపాటున<br>బంధురీత్యా మీ మేనల్లుడయిన<br>ఎం.ఎ., నిరుద్యోగి ప్రసాద్."

వుత్తరం డాక్టర్ సుజాత కళ్ళబడింది. యిల్లుపీకి పందిరేసింది. అటు నాలుగు తరాలు, యిటు నాలుగు తరాలు నోటికొచ్చిన తిట్లన్నీ తిట్టింది.

తల్లి వొకవైపు చాటుగా యేడుస్తోంటే, యింకా మండిపోయి శాంతివర్ధన్ కసురుకున్నాడు:

"వీడే ఆ కొంపకు శని. ఈ రకమంతా అంతే," అంటూ ఎగురుతూ అప్పనాయన లోకంలోకి వెళ్ళిపోయాడు.

వెళ్ళాడేకానీ, ప్రసాద్ యిటీవల డా. శాంతివర్ధన్ కలల్లోకి వస్తున్నాడు. యీ రకం వాళ్ళు యింకా ఎందరి అప్పనాయనల లోకంవాళ్ళ సుఖనిద్రలు యే విధంగా చెడగొడతారో యేమో ?

○ 2 మార్చి 1988, ఆంధ్రజ్యోతి ఆదివారం సంచిక.